


# ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని 3, 24, 25వ డివిజన్లలో ప్రచారం



24వ డివిజన్‌లో మంత్రి గంగుల కమలాకర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న ఆడబిడ్డలు

కార్పొరేషన్, నవంబర్ 11: ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే కరీంనగర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ప్రజలను కోరారు. నగరంలోని 3, 24, 25వ డివిజన్లలో శనివారం సాయంత్రం ఆయన ప్రచారం చేశారు. ఆయా డివిజన్లలో మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు మంత్రి గంగులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తనకు ఓటు వేస్తే అది కేసీఆర్‌కు వేసినట్లేనని పేర్కొన్నారు. సమైక్య పాలనలో తాగునీటి కోసం ఎంతో గోసపడ్డామని తెలిపారు. ఆడబిడ్డలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. స్వరాష్ట్రంలో నగరాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగు, తాగునీటి కష్టాలు తీరాయన్నారు. వేసవిలో కూడా మానేరు డ్యామ్‌తోపాటు చెరువులు, కుంటలు నీటితో నిండుగా ఉన్నాయన్నారు. నగరంలో ఎక్కడా కూడా తాగు నీటి సమస్య లేకుండా చేశామన్నారు. ఇప్పుడిప్పుడే పచ్చబడ్డ తెలంగాణలో చిచ్చుపెట్టేందుకు విషసర్పాలు కాచుకొని కూర్చున్నాయని విమర్శించారు. తెలంగాణ సంపదను దోచుకునేందుకు ఆంధ్రా నాయకులు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీలకు అధికారం కట్టబెడితే మళ్లీ ఇక్కడి యువత ఉపాధి లేక ముంబై, దుబాయ్, భీవండి ప్రాంతాలకు వలస పోయే రోజులు వస్తాయన్నారు. ఎలాగైనా కేసీఆర్‌ను ఓడించి పచ్చని తెలంగాణలో చిచ్చు పెట్టేందుకు ఆంధ్రోళ్లు హైదరాబాద్‌లో అడ్డా వేశారని విమర్శించారు. కేసీఆర్‌ను ఓడగొట్టేందుకు ఢిల్లీ పార్టీలను మేనేజ్ చేస్తున్నారని విమర్శించారు. మరోసారి తనకు అవకాశం ఇస్తే కరీంనగర్‌ను గొప్పగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని విమర్శించారు. సర్పంచ్‌గా ఉంటేనే 32 కేసులు ఉన్నాయని, ఇక ఎమ్మెల్యే అయితే వందల కేసులు నమోదవుతాయని చెప్పారు. ఎంపీ బండి సంజయ్ ఎప్పుడైనా ప్రజలకు కనిపించారా అని ప్రశ్నించారు.? నగరంలో తాను బ్రహ్మోత్సవాలు నిర్వహించానని, ఇప్పుడు టీటీడీ ఆలయం, ఇస్కాన్ టెంపుల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. 24వ డివిజన్‌లో బీజేపీ నాయకురాలు రాగుల లక్ష్మి బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, ఎడ్ల సరిత-అశోక్, కంసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీజేపీ నాయకురాలు రాగుల లక్ష్మికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్



ప్రచార కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు

# అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి..



యువకుడికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి (రామడుగు), నవంబర్ 11: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. రామడుగు మండలం గుండి గ్రామంలో సర్పంచ్ గుండి మానస-ప్రవీణ్ ఆధ్వర్యంలో సుమారు 40 మంది యువకులు, కొక్కెరకుంట గ్రామానికి చెందిన సుమారు 80 మంది, తిర్మలాపూర్ గ్రామానికి చెందిన 20 మంది శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బీజేపీ సీనియర్ నాయకుడు ముంజాల ప్రవీణ్, వార్డు సభ్యులు మేడి మహేశ్, పార్వతి కొమురయ్య, బీజేపీ నాయకులు మచ్చ అంజయ్య, మచ్చ ఎల్లయ్య, మచ్చ రాములు, మచ్చ రాయమల్లు, మచ్చ శ్రీనివాస్, పార్వతి మల్లయ్య, గుజ్జ రమేశ్, పొన్నం పరశురాములు, బొడిగె శ్రీనివాస్, మందపల్లి రవి, ఆయుబ్, బొజ్జు, బబ్లు, అఫ్రోజ్ సల్మాన్, సమీర్, రఫీక్, ఖలీల్, తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ మానస-ప్రవీణ్, రంగు అశోక్, ఆసిఫ్, వంశీ, అహ్మద్, సోహల్, మొహిద్, తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో బంపర్ డ్రా

విద్యానగర్, నవంబర్ 11: కరీంనగర్‌లోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో దీపావళిని పురస్కరించుకొని నిర్వహించిన బంపర్ డ్రా ఏర్పాటు చేశారు. కాగా, శనివారం రాత్రి లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించగా, యూబీఐ మేనేజర్ భాస్కర్, సీఏ శర్మ హాజరై డ్రా తీశారు. లక్కీ డ్రాలో ఆల్టో కారును రాజస్థాన్‌కు చెందిన వాణీశర్మ గెలుచుకున్నారు. అలాగే, వినియోగదారులకు 5 ఎల్ఈడీ టీవీలు, 5 గ్రైండర్లు, 5 సిల్వర్ గ్లాసులు, 5 స్మార్ట్ వాచ్‌లను అందించారు. షాపింగ్ మాల్ నిర్వాహకుడు గౌరిశెట్టి అరుణ్ మాట్లాడుతూ, బతుకమ్మ, దసరా, దీపావళి పండుగ సందర్భంగా సామాన్య ప్రజలకు విభిన్నమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో ఉంచామన్నారు. రూ.5 కోట్ల విలువైన బహుమతులను 2005 మంది వినియోగదారులకు అందించామన్నారు. ప్రతి పండుగకు బంపర్ డ్రా ఉంటుందని చెప్పారు. కారు విజేత వాణీశర్మ మాట్లాడుతూ, రాజస్థాన్ నుంచి గ్రానైట్ వ్యాపారం కోసం ఇక్కడికి వచ్చామని, మా దగ్గర పనిచేసే వారికి దీపావళి సందర్భంగా దుస్తులు కొనుగోలు చేయగా ఆల్టో కారు రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.



వాణీ శర్మకు కారు కీ అందిస్తున్న యూబీఐ మేనేజర్ భాస్కర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్వాహకుడు గౌరిశెట్టి అరుణ్










